అభివృద్ధికి దారులు

కర్నూలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ పాలనా కాలంలో ఉమ్మడి జిల్లాలో రోడ్ల గురించి పట్టించుకోలేదు. ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. వానొస్తే రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గుంతల రోడ్లతో జనం అవస్థలు ఎన్నో. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. ఎన్నికల సంవత్సరం కావడంతో నిధులు వస్తాయి.. రహదారులు పురోగతి సాధిస్తాయని ప్రజలు ఆశించారు. అయితే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. అధ్వానంగా మారిన రహదారుల గోతులను పూడ్చేందుకు కర్నూలు జిల్లాకు రూ.31.34 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.45.75 కోట్లు మంజూరు చేసింది. గ్రామీణ రహదారుల రూపురేఖలు మార్చేందుకు రూ.68 కోట్లు ఇచ్చింది. తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చకుండా రాబోయే 2025 సంవత్సరంలో రహదారులను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని ప్రజలు కోరుతున్నారు. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలుకుతున్న ఈ సందర్భంలో ఉమ్మడి జిల్లాలో రహదారుల తీరుతెన్నులపై ఆంధ్రజ్యోతి విశ్లేషణ.

- వైసీపీ హయాంలో అటెకెక్కిన రహదారుల పురోగతి
- గుంతలమయంగా ప్రధాన రహదారులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు రూ.77.04 కోట్లు
- వేగం పుంజుకున్న అసంపూర్తి పనుల పురోగతి







కర్నూలు జిల్లాలో 3,399.75 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో 1,512.605 కిలోమీటర్లు వివిధ రహదారులు రోడ్లు భవనాలు శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. బీటీ (తారు) రోడ్లదే అగ్రస్థానం. కర్నూలు జిల్లాలో బీటీ రోడ్లు 3,029.93 కి.మీలు, నంద్యాల జిల్లాలో 1,300.35 కి.మీలు ఉన్నాయి. సీసీ, కంకర, మట్టి రోడ్లు సరేసరి. ప్రగతికి చిహ్నలైన రహదారుల అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వ ఆయాంలో పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. పల్లె రోడ్లు ప్రగతికి మెట్లు..! అనే నానుడి ప్రకటనలకే పరిమితం చేశారు. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్ల రోడ్ల ప్రగతి, మరమ్మతులు గాలికొదిలేసినా.. 2024 ఎన్నికల సంవత్సరం కావడంతో ఓట్ల కోసం భారీగా నిధులు ఇస్తారు.. రహదారులు అందంగా మారుతాయని సహజంగా అందరూ ఆశించారు. ఆ దిశగా తీసుకున్న చర్యలు నామమాత్రమే. ఎన్నికల బడ్జెట్‌లో కూడా రోడ్లకు నిధులు నామమాత్రంగానే ఇచ్చారు. మార్చి 16న ఎన్నికల షెడ్యూలు వచ్చింది. ఓట్ల కోసం నాయకులు ఏ గ్రామానికి వెళ్లినా అయ్యా..! మా ఊరి రోడ్డు బాగుచేయించండి చాలు..! అంటూ విన్నవించారంటే రహదారుల దుస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఒకటి రెండు నెలలు ఆలస్యంగానైనా సరే రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. 2025లో రోడ్ల శాశ్వత అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


నాడు: హొళగుంద-హోన్నూరు కొట్టాల రోడ్డు దుస్థితి

● మరమ్మతులకు రూ.77.04 కోట్లు:

టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే గుంతలు పూడుస్తూ.. కొత్త రోడ్లు వేస్తూ ప్రజల అవస్థలు తీరుస్తూ వారి మన్ననలు పొందుతోంది. జిల్లాలో మేజరు రోడ్లు అడుగుకో గుతితో నాడు దర్శనం ఇస్తే.. నేడు మెరిసే రోడ్లుగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్ల భవనాలు శాఖ పర్యవేణలో వివిధ రోడ్లు మరమ్మతులకు కర్నూలు జిల్లాలో 429 కి.మీలు బాగు చేసేందుకు రూ.31.34 కోట్లు, నంద్యాల జిల్లాలో 359.74 కి.మీలు మరమ్మతులకు రూ.45.75 కోట్లు మంజూరు చేశారు. ముప్పాతిక శాతం మరమ్మతులు పూర్తి చేశారు. కొన్ని గ్రామాల్లో రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఆరు నెలలకు ముందు అధ్వాన్నంగా ఉన్న రోడ్లు.. నేడు మరమ్మతులకు నోచుకోవడంతో పల్లె ప్రజలు ప్రజా ప్రభుత్వం అంటే ఇది అంటూ కితాబు ఇస్తున్నారు. అదే క్రమంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. పంచాయతీరాజ్ (పీఆర్) పర్యవేక్షణలో పల్లె సీమలు కనెక్టివిటీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఉపాధి హామీ పథకం కింద కర్నూలు జిల్లాలో రూ.71.04 కోట్లతో 837 పనులు. నంద్యాల జిల్లాలో రూ.85.95 కోట్లతో 1,026 పనులు చేట్టారు. వివిధ దశల్లో ఉన్నాయి.


నేడు: రూ.4.70 కోట్లతో హొళగుంద-హోన్నూరు కొట్టాల రోడ్డు బీటీ రోడ్డుగా ఆధునీకరణ


నాడు: ఎమ్మిగనూరు పట్టణంలో గోనెగండ్ల సర్కిల్‌లో ప్రధాన రోడ్డు దుస్థితి


నేడు: ఎమ్మిగనూరు పట్టణంలో గోనెగండ్ల సర్కిల్‌లో ప్రధాన రోడ్డు మరమ్మతులకు శ్రీకారం

పదవుల భర్తీకి సహకారం

- సహకార సంఘాలు, మార్కెట్ కమిటీల భర్తీకి నిర్ణయం
- నేతలు, అనుచరుల్లో సంబరాలు
- ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం క్యూ కట్టిన కింది స్థాయి నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రెండు రోజుల కిందట రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పదవుల భర్తీని సంక్రాంతి లోపు చేపడుతామని ప్రకటించడంతో ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న కీలక నేతలు, చోటా మోటా నాయకులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. తమకు ఆ పదవులు దక్కితే తమ జీవితాలు ధన్యమైనట్లేనని ఆశల పల్లకిలో విహరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు ఉన్నాయి. 2018 నుంచి ఈ సంఘాలకు సహకార బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సిఫారసు మేరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసింది. అప్పట్లో సంఘాల్లో రైతులకు రుణాలు ఇప్పించే విషయంలో ఎన్నెన్నో అక్రమాలు జరిగాయి. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకునే వారు కరువయ్యారు. రుణం కోసం రైతులు సంఘాల కార్యాలయాలకు వెళితే మాకు ఎంత ఇస్తావు అంటూ త్రీమెన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేయడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక త్రీమెన్ కమిటీలను రద్దు చేసింది. వారి స్థానంలో అధికారుల నేతృత్వంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో సహకార శాఖలోని అధికారులు, ఉద్యోగులు పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకకు జాయింట్ కలెక్టర్లు పర్సన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. దాదాపు ఏడు నెలలు అధికారుల పర్యవేక్షణలోనే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్వహణ అధికారులే చూస్తుండటంతో తమకు ఎటువంటి ప్రాధాన్యత లేకపోవడం దారుణమని, ఎమ్మెల్యేల అనుచరులు, గ్రామాల్లోని చోటామోటా నాయకులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ పరిస్థితిని కీలక నేతలు గ్రహించారు. మరో దారి లేక ఎమ్మెల్యేల సిఫారుసుతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను పార్టీలోని ముఖ్య



మైన నేతలతో భర్తీ చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వ పెద్దలు వచ్చారు.

● ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు క్యూ: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించడంతో ఈ విషయంలో ఎమ్మెల్యేల సిఫారసులు పరిగణనలోకి తీసుకోవడంతో ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు, గ్రామాల్లోని చోటా మోటా నాయకులు ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. అదే విధంగా మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం కూడా ప్రభుత్వం ఎమ్మెల్యేల సిఫారసులనే పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిలో కర్నూలు, నంద్యాల, ఆదోని డోన్, బనగానపల్లె, ఆలూరు, కోడుమూరు, నందికొట్కూరు, ఆత్మకూరు మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్యేల ప్రాపకం పొందేందు కోసం నాయకులు తమ ప్రయత్నాలు మొదలు పెట్టేశారు. ఈ పదవులు ఎవరికి దక్కుతాయోనని కూటమిలోని ప్రధాన భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు ఎదురు చూస్తున్నారు.

పదింతల ప్లానింగ్

వంద రోజుల తరగతులకు శ్రీకారం

విద్యాశాఖ ఎస్ఈఆర్టీ ఆధ్వర్యంలో సిద్ధం


విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం, యూటీఎఫ్ నాయకులు

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా శాఖ అధికారులు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ మేరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. నంద్యాల జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నిర్ణయించిన కాలనిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో తెలియజేస్తూ మెలకువలు చెబుతున్నారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా పది పరీక్షల్లో శతశాతమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. - వివరాలు 7లో..



యేసు మార్గం ఆచరణీయం

● క్రైస్తవ మత పెద్దల ఉద్బోధన ● ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కరుణామయుడు యేసుక్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని పలువురు క్రైస్తవ మత పెద్దలు పిలుపునిచ్చారు. శాంతియుత జీవన మార్గమే ఆ మహనీయుడు లోకానికి ఇచ్చిన గొప్ప సందేశమని బోధించారు. శాంతి, సహనం, సద్భావనలతో సమాజంలో ప్రతిఒక్కరూ కలిసిమెలసి జీవించాలని, ప్రపంచానికి ఆదర్శంగా ఉండాలన్నారు. యేసుక్రీస్తు జన్మదిన వేడుక 'క్రిస్మస్'ను బుధవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలకు సంబంధించిన మతపెద్దలు క్రీస్తు సందేశాన్ని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ పాపాల విముక్తికి తపిస్తారని, క్రీస్తు ప్రభువు పాపభీతిని రూపుమాపి అందరికీ ప్రేమ, శాంతి, త్యాగాన్ని పంచి, మానవుల జీవితానికి ఒక మంచి సుగుణాన్ని అందించారని చెప్పారు.



ముసురు ముప్పు..!

- తడిసిన వరి, మినుము, మొక్కజొన్న
- ఆందోళనలో అన్నదాతలు


నగల్లపాడు గ్రామ సమీపంలో ఒంటెద్దుబండ్లతో తరలిస్తున్న వరి బస్తాలు


రుద్రవరం మండలం చిన్నకంబలూరు సమీపంలో వరి ధాన్యం బస్తాలు ట్రాక్టరుకు లోడు చేస్తున్న దృశ్యం

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడటంతో చాగలమర్రి మండలంలో బుధవారం తెల్లవారు తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రహదారులు, పొలాల్లో ఆరబెట్టుకున్న వరి, మినుము, మొక్కజొన్న, జూట్ ధాన్యం తడిసిపోయింది. మొన్నటి వరకు తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ మరో అల్పపీడనంతో కంటిమీద కునుకు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి జల్లులు కురవడంతో పంట పొలాలకు వెళ్లి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్లు, ఎద్దులబండ్లతో ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి గృహాలకు చేరవేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని, దీంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.


రుద్రవరం మండలం ఓ ప్రైవేటు గోడౌను వద్ద క్యూలో ఉన్న ట్రాక్టర్లు

రాలుతున్న చినుకులు.. ఆవిరవుతున్న ఆశలు

రుద్రవరం: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బుధవారం తుఫాను ప్రభావంతో స్వల్పంగా వర్షం కురిసింది. రైతులు వరి ధాన్యం రాశులపై పట్టలు కప్పడంలో నిమగ్నమయ్యారు. కొండమాయపల్లె నుంచి గాజులపల్లె మెట్ట వరకు వరి ధాన్యం రాశులు రహదారి వెంట కిలోమీటర్ల మేర ఉన్నాయి. కోటకొండ, యల్లావత్తుల టి.కొట్టాల, శ్రీరంగాపురం, చిన్నకంబలూరు ఇంకా పలు గ్రామాల్లో తుఫాను ప్రభావంతో స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో రైతులు ట్రాక్టర్లలో వరిధాన్యం బస్తాలు నింపుకుని పంట పొలాల నుంచి గ్రామాలకు తరలిస్తున్నారు.


చాగలమర్రి సర్వీసు రహదారిలో వరి ధాన్యంపై పట్టలు కప్పిన రైతులు



మత పెద్దల ప్రసంగం





నగరంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు

హ్యాపీ.. హ్యాపీ.. క్రిస్మస్

● నగరంలో కళకళలాడిన చర్చిలు ● ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అందాల తార.. అరుదెంచె నాకై.. అంబరవీధిలో.. అవతార మూర్తి.. యేసయ్య కీర్తి అంటూ పాడుకుంటూ క్రీస్తు విశ్వాసులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మానవాళి క్షేమం కోసం శిలువపై రక్తాన్ని చిందించిన కరుణామయుడి కరుణ కోసం క్రిస్మస్ రోజున ధ్యానించారు. బుధవారం క్రీస్తు జన్మదినం క్రిస్మస్‌ను పురస్కరించుకుని కర్నూలు నగరంలోని వివిధ చర్చిల్లో పండుగ వాతావరణం నెలకొంది. చర్చి ప్రాంగణాల్లో ఏసు జన్మ వృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక నమూనాలతో అలంకరించారు. నగరంలోని కోల్స్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో సంఘ కాపరి రెవ.ఆర్.అనిల్ శామ్యూల్, ఎస్‌పీజీ (సీఎస్ఐ) చర్చిలో రెవ.వరప్రసాదరావు దైవ సందేశం అందించారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బిషప్ చర్చిలో బిషప్ జాన్‌వెస్లీ, ప్రార్థన మందిరంలో రెవ. గంటా కరుణ సాగర్, హోసన్న మందిరంలో బ్రదర్ ఫ్రెడి పాల్, హోరేబు ప్రార్థన మందిరంలో బ్రదర్ శాంసన్, షమ్మా చర్చిలో బ్రదర్ స్టీఫెన్ చార్లెస్ భక్తులకు దైవ సందేశాన్ని ఇచ్చారు. నగరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న పాస్టర్





భక్తులకు రొట్టె, ద్రాక్షరసం అందజేస్తున్న పాస్టర్



నంద్యాలలో...



యువతుల ప్రార్థన



ఎమ్మిగనూరులో...





కర్నూలు నగరంలోని కోల్స్ చర్చిలో ప్రభు కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని పెద్దమర్రివీడు గ్రామం, నందవరం మండలంలోని జొహరాపురం గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని కందనాతి, కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం, కౌతాళం మండలంలోని పోడలకుంట, మంత్రాలయం మండలంలోని బసాపురం, ఆదోని మండలంలోని కపటి, కోసిగి మండలంలోని ఎండవల్లి, హొళగుంద మండలంలోని హొళగుంద, కౌతాళం మండలంలోని మదిరి, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని తిప్పాయపల్లె, కల్లూరు మండలంలోని బస్తిపాడు, వెల్దుర్తి మండలంలోని నర్లాపురం, కర్నూలు రూరల్‌లోని ఎదురూరు, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని తుగ్గలి మండలంలోని తుగ్గలి, ఆలూరు మండలంలోని కమ్మరికచేడు, చిప్పగిరి మండలంలోని ఖాజాపురం, ఆస్పరి మండలంలోని తురువగల్, హాలహర్వి మండలంలో గూళ్యం, జే. కొసల్లి గ్రామం మొత్తం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని పెద్దమకానం వీధికి చెందిన యువతి అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ బుధవారం రాత్రి తెలిపారు. యువతి తండ్రి నూర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అన్నారు.

అభివృద్ధికి దారులు

(5వ పేజీ తరువాయి)



నాడు: హొళగుంద-చిన్నహ్యాట రోడ్డు దుస్థితి



నేడు: హొళగుంద-చిన్నహ్యాట రోడ్డు రూ.4 లక్షలతో మరమ్మతులు

● 2025లో వీటిపై దృష్టి సారించాలి:

2024కు వీడ్కోలు పలికి.. 2025కు స్వాగతం పలుకుతున్న శుభ వేళ ఉమ్మడి జిల్లాకు చెందిన రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు అసంపూర్తిగా ఉన్న రహదారుల పనులుపై ఫోకస్ పెట్టాలి. గడువులోగా పూర్తి చేయాలి. అదే క్రమంలో కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా మార్పు చేసి నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలి. కోడుమూరు-ఎమ్మిగనూరు వయా గోనెగండ్ల రోడ్డు, ఎమ్మిగనూరు-కోసిగి వయా మాలపల్లి రోడ్డు, డాణాపురం-హొళగుంద వయా హెబ్బటం రోడ్డు, ఆలూరు-హొళగుంద వయా ఎల్లార్తి రోడ్డును ఆధునికీకరించాలి. అదే క్రమంలో గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని రోడ్డును జాతీయ రహదారిగా మార్పు చేసి అభివృద్ధి చేయాలి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు-దోర్నాల వరకు జీకే రోడ్డును నల్లమల అడవిలో నాలుగు రోడ్ల రహదారిగా మార్పు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఉమ్మడి జిల్లాలో రోడ్లు భవనాలు శాఖ పర్యవేక్షణలోని రహదారులు, వివిధ పథకాలు కింద చేపట్టిన పనులు, ప్రస్తుత పురోగతి వివరాలు:

రహదారులు		కర్నూలు	నంద్యాల
బీటీ (తారు) రోడ్లు	(కి.మీలు)	3,029.93	1,300.35
సీసీ రోడ్లు	(కి.మీలు)	307.27	175.47
కంకర రోడ్లు	(కి.మీలు)	27.28	4.88
మట్టి రోడ్లు	(కి.మీలు)	25.27	32.22
మొత్తం		**3,389.75**	**1,512.92**

చేపట్టిన పనులు	227
నిధులు (రూ.కోట్లల్లో)	1,586.69
పూర్తైన పనులు	143
చేసిన ఖర్చు (రూ.కోట్లల్లో)	495.74
మరమ్మతులు పనులు(కి.మీలు)	429
ఇచ్చిన నిధులు (రూ.కోట్లల్లో)	31.34

ఆటో బోల్తా... బాలుడు మృతి

ఆదోని రూరల్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం గణేకల్లు గ్రామానికి చెందిన బాలుడు అరవింద్(6) రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. బుధవారం గణేకల్లు బంగారమ్మవ్వ దేవర సందర్భంగా గ్రామ శివార్లలో ఉన్న మారెమ్మ దేవాలయానికి పూజల నిమిత్తం బంధువులు ఆటోలో బయల్దేరగా.. అరవింద్ కూడ వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో అరవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు నాగవేణి, రామాంజనేయులు ప్రమాద స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

ఉయ్యాలవాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రూపనగుడి గ్రామానికి చెందిన శేషుగాల్ల రమేష్‌పై అదే గ్రామానికి చెందిన ముసల్లిగాల్ల నాగేంద్ర, నాగార్జునలు దాడి చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. రమేష్ దంపతులు మంగళవారం రాత్రి చర్చికి వెళ్తుండగా పాత గొడవలు మనసులో పెట్టుకొని దాడి చేశారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పదింతల ప్లానింగ్

వంద రోజుల తరగతులకు శ్రీకారం

విద్యాశాఖ ఎస్‌ఈఆర్టీ ఆధ్వర్యంలో సిద్ధం

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాల విద్యాశాఖ ఎస్‌ఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణతో పాటు మరికొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఆదివారం కూడా అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 28,294 మంది ఉన్నారు. ఎయిడెడ్ పాఠశాలలో 16, ఏపీఎంఎస్ 20, బీసీ 6, ప్రభుత్వ పాఠశాలు 12, కేజీబీవీ 26, ఎంపీఎల్ 4, పీవీటీ 172, ఎస్‌డబ్ల్యూ 5, టీడబ్ల్యూ 12 జెడ్పీ పాఠశాలలు 182 ఉన్నాయి. ఇందులో బాలికలు 12,085, బాలురు 13,209 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ విద్యార్థులు ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

● ఉదయం 8 గంటల నుంచి 5 గంటల వరకు మధ్యాహ్నం 2.40 గంటల నుంచి 4 గంటల వరకు

● ఆదివారాల్లో ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

● ఇవి మార్గదర్శకాలు

● విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, అదనపు తరగతుల నిర్వహణ, నిత్యం చిన్న చిన్న పరీక్షలు పెట్టడం, అవసరమైన పాఠాల పునశ్చరణ, పబ్లిక్ పరీక్షల బ్లూప్రింట్ నమూనాలో ప్రీ ఫైనల్ నిర్వహించి భయం పోగొడతారు.

● ఉన్నతాకారుల పర్యవేక్షణకు వీలుగా ప్రతి విద్యార్థి జవాబు పత్రాలు, మార్కుల పత్రాలను భద్రపరచడం, రానున్న రోజుల్లో ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-1 గ్రాంట్ టేస్టు, ప్రీ ఫైనల్ పరీక్షల సన్నద్ధత దీనిలో భాగమేనని, ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

● అదే సమయంలో మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తేదీలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.



పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పది విద్యార్థులు

● విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించి, వారికి పరీక్షలు పెట్టి వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడ్‌లుగా విభజిస్తారు. తదనుగుణంగా వారికి బోధించి మంచి ఫలితాలు సాధించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

● పాఠశాల వారీగా ప్రభుత్వం హోలిస్టిక్ కార్డులు ఇటీవల పంపిణీ చేసింది. వీటిపై ఇప్పటి వరకు అంతర్గతంగా నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ముద్రించి తల్లిదండ్రులకు అందజేయనున్నారు. వందరోజుల దీక్షలో ఎంఈవోలు పర్యవేక్షణ చేసి హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ప్రోత్సహిస్తూ పర్యవేక్షణ చేస్తారు.

జిల్లాలో మంచి ఫలితాలు సాధిస్తాం



జిల్లాలో మంచి ఫలితాలు సాధించే దిశగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలవుతుంది. విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించి వారి మదింపు అంచనా వేసి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటాం. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల జిల్లా

విద్యుత్ డిస్కమ్ ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): చండీఘర్ ప్రభుత్వ విద్యుత్ డిస్కం ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాకృష్ణ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం సుందరయ్య కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వ రంగాలన్నింటినీ ప్రైవేటుపరం చేయడంలో దూకుడును పెంచిందన్నారు. చండీఘర్ రాష్ట్ర డిస్కమ్‌ను ప్రైవేటు సంస్థ ఎమినెంట్ ఎలక్ట్రికల్ లిమిటెడ్‌కు అమ్మడానికి డిసెంబరు 4న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. చండీఘర్ కార్మికులకు మద్దతుగా నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, నాయకులు ప్రభాకర్, మహ్మద్‌రఫీ, కే. సుధాకరప్ప, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలను దోచుకుని కార్పొరేట్లకు లాభాలు తెచ్చిపెట్టే విద్యుత్ ప్రైవే టీకరణ ఆపాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రాజగోపాల్ డిమాండ్ చేశారు. చండీఘర్ కార్మికులకు మద్దతుగా పూలబజార్ కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌దారులకు లబ్ధి చేకూర్చే విధంగా సంస్కరణలు చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రామక్రిష్ణ, అబ్దుల్‌దేశాయ్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్

● చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు
● మత పెద్దల సందేశాలు

కర్నూలు(కల్చరల్), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపు కున్నారు. నగరంలోని సీఎస్ఐ, కోల్స్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బిషప్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక పార్థనలు చేశారు. హోరేబు, హోసన్న, బిషప్ చర్చిల్లో భక్తులకు పాస్టర్లు దైవ సందేశాన్ని ఇచ్చారు. క్రైస్తవులు ఒకరికి ఒక్కరూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● లేబర్ కాలనీలోని ఎల్లోహిమ్ చర్చిలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని పాస్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పార్థనలు చేశారు. క్రీస్తు సందేశాలను భక్తులకు వివరించారు. మానవ రక్షణకుడిగా, దైవదూతగా క్రీస్తు భూమిపై జన్మించారని, ప్రేమ, కరుణ, సేవాభావంతో మానవాళిని సన్మార్గంలో నడిపించిన ప్రభువు ఏసుక్రీస్తు మతపెద్దలు వివరించారు. రాత్రి చర్చ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

ఓర్వకల్లు: మండలంలోని గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, హుశేనాపురం, గుట్టపాడు, శకునాల తదితర గ్రామాల్లో క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో పాస్టర్లు యేసు క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు, కల్లపరి, పులకుర్తి, లద్దగిరి, ప్యాలకుర్తి, గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ, లద్దగిరి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు లోకరక్షకుడని, ప్రభు చూపిన మార్గంలో ప్రజలంతా నడవాలని పాస్టర్లు సందేశం వినిపించారు.

గూడూరు: గూడూరుతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌తోపాటు కొత్తకోట, పోలకల్లు, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొండాపురం, గుండ్రేవుల తదితర గ్రామాలలో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో పాస్టర్లు యేసు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. టీడీపీ మాజీ మండల కన్వీనర్ పాండురంగన్నగౌడు, డాక్టర్ తిమ్మప్ప, విష్ణు హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న, మాజీ ఎంపీపీ దేవరాజు, ధనుంజయుడు పాల్గొన్నారు.



లేబర్ కాలనీ ఎల్లోహిమ్ చర్చి ఆవరణలో నృత్యం చేస్తున్న చిన్నారులు





గూడూరులో.. కర్నూలు ప్రార్థన మందిరం, వర్కూరులో దైవ సందేశం వినిపిస్తున్న పాస్టర్లు



హోరేబు మందిరంలో ప్రసంగిస్తున్న బ్రదర్ శాంసన్



కర్నూలులోని బిషప్ చర్చిలో పార్థనలు చేస్తున్న క్రైస్తవులు



హుశేనాపురంలో..



సి. బెళగల్‌లో..

ఎంట్రీ పాసుల ఆవిష్కరణ



ఎంట్రీ పాసులను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'హైందవ శంఖారావం' కార్యక్రమానికి తరలి వెళ్లే వాహనాల ఎంట్రీ పాసులు, కార్యకర్తల ఐడీ కార్డులను బుధవారం వీహెచ్‌పీ నాయకులు ఆవిష్కరించారు. నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేశ్, హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, సహ కన్వీనర్లు చంద్రశేఖర్, హనుమంతరెడ్డి, కార్యక్రమ రవాణా ప్రముఖ్‌లు ఈపూరి నాగరాజు, ఎస్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైందవ శంఖారావం కార్యక్రమానికి జిల్లా నుంచీ 30 బస్సులు, 250 కార్లు, రైలు మార్గం ద్వారా 1300 మంది కార్యకర్తలు హాజరవుతారన్నారు. ప్రతి కార్యకర్తకు గుర్తింపు కార్డుతోపాటూ, వాహనాలకు ఎంట్రీ పాసులు జారీ చేసినట్లు తెలిపారు. విజయవాడలో జరిగే ఈ హైందవ శంఖారావం బహిరంగ సభకు గుర్తింపు లేకుండా వాహనాల అనుమతి లేనందున వీటిని జారీ చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది

కర్నూలు అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని పరిమళ నగర్‌లో వరద శ్రీనివాస్ అనే వ్యక్తి నుంచి 55 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. బుధవారం డీటీఎఫ్ సీఐ కే.రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి నగరంతోపాటు కొల్లంపల్లి తాండలో కూడా దాడులు చేయగా నేనవత్ లోకేశ్ నాయక్ వద్ద 36 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని మెటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఏసీపీ హనుమంతరావు, అసిస్టెంట్ ఏసీపీ రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీస్తు జననం మానవాళికి పర్వదినం



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రీస్తు జననం మానవాళికి పర్వదినమని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక విభాగం మాజీ అధ్యక్షుడుడ కురవ నాగేషు ఏసుక్రీస్తు కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఎస్‌సీ బజారన్న, కే. సత్యానారాయణగుప్త తదితరులు పాల్గొన్నారు.

కురువ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం కర్నూలు జిల్లా కురువ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత కురువ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్ యుగంధర్, ప్రసాద్, ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, పెద్దపాడు ధనుంజయ, కే.దేవేంద్ర, కోశాధికారి కేసీ నాగన్న, పాల సుంకన్న, బీసీ తిరుపాలు, బి. రామకృష్ణ, కే.సోమన్న, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రాజశేఖర్, పాపారాయుడు, దివాకర్, తేజశ్విని, లక్ష్మన్న, చిన్నయ్య, నాగశేషులు, రఘు పాల్గొన్నారు.

కుర్ని సంఘం ఆధ్వర్యంలో..

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు కుర్నీ (నేసే) సంక్షేమ సంఘం-2025 నూతన క్యాలెండర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుర్ని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు ఆవిష్కరించారు. బుధవారం నగరంలోని బిర్లా కాంపౌండు బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్లో నగర కుర్ని సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఆదిత్య స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షుడు బందకే వాసుదేవయ్య, కుర్ని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య, గడిగే ప్రసాద్, మునిస్వామి, రాధాకృష్ణ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

'మహనీయుల స్ఫూర్తితో ముందడుగు'




వంగవీటి మోహనరంగా, మిరియాల వెంకట్రావు, సినీ నటుడు సత్యనారాయణ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న రోపా ప్రతినిధులు, మిరియాల వెంకట్రావు జయంతి వేడుకల్లో పాల్గొన్న బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మహనీయుల స్ఫూర్తితో ముందడుగు వేద్దామని బలిజ సంఘం పెద్దలు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని బిర్లా కాంపౌండులోగల సాయి వసంత్ కాంప్లెక్స్‌లోని రోపా (రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) కార్యాలయంలో బలిజ, కాపు మహనీయుల స్మృతి సభను రోపా అధ్యక్ష, కార్యదర్శులు చింతలపల్లి రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. దివంగత వంగవీటి మోహన్‌రంగా, కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మిరియాల వెంకట్రావు, దివంగత సినీ నటుడు కైకాల సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం నాయకులు వినుకోట నాగేశ్వరరావు, భాస్కర్‌బాబు, కోనేటి చంద్రబాబు, ఐ.వెంకటేశ్, రామ్‌నాథ్, మర్రి రమేష్ బాబు, మలి శెట్టి దివాకర్‌రావు, రామాంజినేయులు, బీఏ శ్రీనివాసరావు హాజర య్యారు. కార్యక్రమంలో రోపా, బలిజ సంఘం ప్రతినిధులు అంచ పెద్దస్వామి, వడ్ల శ్రీకాంత్, జి.రంగనాయకులు, బుర్రా చంద్రమో హన్, గన్నపురెడ్డి శ్రీనివాసరావు, గౌతమ్‌కృష్ణ, జె.శ్రీనివాసులు, తుళువ గోపాల్, మధుసూదనరావు, అమరం నరసింహారెడ్డి, జగన్, గిరిబాబు, మురళీమోహన్, కొణిదెల శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా మిరియాల వెంకట్రావు జయంతి: రాష్ట్ర కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మిరియాల వెంకట్రావు 84వ జయంతిని బుధవారం కర్నూలు నగర బలిజ సంఘం కార్యాలయంలో బలిజ సంఘీయులు ఘనంగా నిర్వహించారు. మిరియాల వెంకట్రావు చిత్రపటానికి, అలాగే వంగవీటి మోహన్‌రంగా, శ్రీకృష్ణ దేవరాయలు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి 39 వార్డు కార్పొరేటర్ సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వెంకట్రావు కాపు ఉప కులాలైన కాపు, బలిజ, తెలగ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరు కాపు కులలను ఐక్య పరచి, రాజకీయ చైతన్యం తీసుకువచ్చి జాతి ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో నగర బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్, గౌరవ సలహాదారు సింగంశెట్టి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌కుమార్, కోశాధికారి శైలేశ్, కార్యవర్గ సభ్యులు శోభన్ బాబు, ప్రకాశ్‌బాబు, అమర్‌నాథ్, లక్ష్మీకాంతరెడ్డి, అనిమిరెడ్డి, శివనాగ రాజు, సుజాత, శ్రీలక్ష్మి, జానకమ్మ, విజయలక్ష్మి, హేమలత, ఉమామ హేశ్వరి పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీఎస్ నాగరాజు, నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి రిటైర్డు ప్రిన్సిపాల్ డా.కొట్టె చెన్నయ్యలు హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాజ్‌పేయి వ్యక్తిగతం, నిజాయితీ, నిబద్ధత గురించి పార్టీకి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాణ్యం బీజేపీ కన్వీనర్ రామమద్దిలేటి, రామోహన్ రెడ్డి, దిలీఫ్ వర్మ, రమణ యాదవ్, మహేంద్ర, సురేష్, మోహన్‌రావు, రామకృష్ణ, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: భారత మాజీ ప్రధాని, దివంగత వాజ్‌పేయి ఆదర్శ నేత అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం వాజ్‌పేయి జయంతి సందర్భంగా 46వ వార్డు నరసింహా రెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ దేశ ప్రధానిగా అందరికీ సుపరిపాలన అందించిన ఘనత వాజ్‌పేయికి దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లోకేశ్వరయ్య, రామాంజినేయులు, శివయ్య శెట్టి, శ్రీనివాసులు, మహేష్, పర్ల శివ, అయూబ్‌ఖాన్, జావీద్ పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



రైతులను ఉత్తేజపరిచేందుకే సంబరాలు

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులను ఉత్తేజ పరిచేందుకే సంబరాలు నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులో క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఏబీఎం చర్చి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి పోటీల ప్రారంభోత్సవానికి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి 16 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ రైతులు ఉత్సాహంగా ఉండడానికి ఎద్దుల బండలాగుడు పోటీలు ఎంతో దోహద పడుతాయన్నారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా రామవరం గ్రామానికి చెందిన రామచంద్రా రెడ్డి ఎద్దులు 4742 అడుగుల దూరం లాగి రూ.35వేల నగదు, రెండో విజేతగా నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి చెందిన వెంకట కృష్ణయ్య ఎద్దులు 4569 అడుగుల దూరం లాగి రూ.30వేలు, మూడో విజేతగా తెలంగాణ రాష్ట్రం వనపర్తి మండలం పెద్ద ధగాట్ గ్రామానికి చెందిన బోగుల యశ్వంత్ ఎద్దులు 4323 అడుగుల దూరం లాగి రూ.20వేల నగదును గెలుపొందాయి. నాలుగో విజేతగా బిల్లాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్దన్ రెడ్డి ఎద్దులు 4246 అడుగుల దూరం లాగి రూ.10వేలు, 5, 6, 7వ విజేతలుగా ధరణి చౌదరి, చిన్నరత్నం, విశ్వనాథరెడ్డిల ఎద్దులు 3,300 అడుగులు లాగడంతో ఒక్కొక్కరికీ రూ.4,200 చొప్పున అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వాడాల రామానాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో వందనాలు, దానమయ్య, రాజు, జడ్పీటీసీ రంగనాథగౌడు, గ్రామ రైతులు చంద్రశేఖర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, కురువ జయన్న, రోళ్లపాడు మద్దిలేటి పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులు

ఓర్వకల్లు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని ఆర్టీసీ బస్టాం డు ఎట్టకేలకు మరమ్మతులకు నోచుకుంది. మే 26వ తేదీన క్షణక్షణం.. భయం భయం ఆర్టీసీ బస్టాండులో ఊడిపడుతున్న పైపెచ్చులు.. భయాందోళనలో ప్రయాణికులు అనే శీర్షిక ప్రచురితమైంది. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు రవాణా సంస్థ టెండర్లు వేసి మరమ్మతులు చేపట్టారు. అలాగే మరుగుదొడ్లు కూడా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, ప్రయాణికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

కంపు.. కంపు

మార్కెట్ యార్డులో శిథిలావస్థలో మరుగుదొడ్లు



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో కార్యాలయానికి కూతవేటు దూరంలోని మరుగుదొడ్లు, టాయిలెట్లు, శిథిలావస్థకు చేరాయి. వాటి నుంచి దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతుండటంతో పరిసరాల్లో పంట ఉత్పత్తులను విక్రయించేందుకు వస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు ఈ టాయిలెట్ల సమీపంలోనే రైతులకు చెందిన డీసీఎంఎస్ కేంద్ర కార్యాలయం ఉంది. అక్కడ రైతులకు అవసరమైన ఎరువులతోపాటు నిత్యావసర వస్తువులను చౌక దరకే విక్రయి స్తున్నారు. కార్యాలయంలో సిబ్బందితోపాటు ఆ కేంద్రానికి వచ్చే రైతులు సమీపంలోనే ఉన్న టాయిలెట్ల నుంచి వస్తున్న కంపును భరించలేక పోతున్నారు. శిథిలావస్థకు చేరిన టాయిలెట్ల స్థానంలో కొత్తవి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

బ్రాహ్మణదొడ్డి నుంచి క్రిష్ణదొడ్డికి గ్రావెల్ రోడ్డు వేయండి



ముళ్ల కంపతో నిండిన బ్రాహ్మణదొడ్డి నుంచి క్రిష్ణదొడ్డి రస్తా

సి.బెళగల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణదొడ్డి నుంచి పాతయ్య కొండ రస్తా మీదుగా క్రిష్ణదొడ్డి గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో బస్సు సౌక ర్యం లేనప్పుడు ప్రయాణికులు ఎద్దులబండ్లు కట్టుకుని గూడూరు మీదుగా కర్నూలుకు వెళ్లేవారు. క్రమంగా ఈ రహదారిని కేవలం పొలాలకు వెళ్లే రైతులు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. గూడూరు నుంచి బ్రాహ్మణదొడ్డి పాతయ్య కొండ క్రిష్ణదొడ్డి గ్రామాల మీదుగా సి.బెళగల్ చేరుకొనే ఈ రస్తా మొత్తం ముళ్ళ కంపతో నిండిపోయింది. రాజకీయ నాయకుల, అధికారులు ఈ దారిని గ్రావెల్ రోడ్డుగా మార్చాలని ఈ గ్రామాల రైతులు కోరుతున్నారు.

సీ.క్యాంపు రైతుబజారులో క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీ.క్యాంపు రైతుబజారులో ప్రతి నెలా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. గురువారం సీక్యాంపు రైతుబజారులో కూరగా యల క్రయవిక్రయాలు నిలుపుదల చేశామని, రైతులు కూరగాయలు తీసుకురావద్దని ఎస్టేట్ అధికారి బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా డ్రైనేజీలను శుభ్రం చేయడంతోపాటు రైతుబజారులో చెత్తాచెదారాన్ని తొలగిస్తామని తెలిపారు.


మత పెద్దల ప్రసంగం




నగరంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు

హ్యాపీ.. హ్యాపీ.. క్రిస్మస్

● నగరంలో కళకళలాడిన చర్చిలు ● ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అందాల తార.. అరుదెంచె నాకై.. అంబరవీధిలో.. అవతార మూర్తి.. యేసయ్య కీర్తి అంటూ పాడుకుంటూ క్రీస్తు విశ్వాసులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మానవాళి క్షేమం కోసం శిలువపై రక్తాన్ని చిందించిన కరుణామయుడి కరుణ కోసం క్రిస్మస్ రోజున ధ్యానించారు. బుధవారం క్రీస్తు జన్మదినం క్రిస్మస్‌ను పురస్కరించుకుని కర్నూలు నగరంలోని వివిధ చర్చిల్లో పండుగ వాతావరణం నెలకొంది. చర్చి ప్రాంగణాల్లో ఏసు జన్మ వృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక నమూనాలతో అలంకరించారు. నగరంలోని కోల్స్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో సంఘ కాపరి రెవ.ఆర్.అనిల్ శామ్యూల్, ఎస్‌పీజీ (సీఎస్ఐ) చర్చిలో రెవ.వరప్రసాదరావు దైవ సందేశం అందించారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బిషప్ చర్చిలో బిషప్ జాన్‌వెస్లీ, ప్రార్థన మందిరంలో రెవ. గంటా కరుణ సాగర్, హోసన్న మందిరంలో బ్రదర్ ఫ్రెడి పాల్, హోరేబు ప్రార్థన మందిరంలో బ్రదర్ శాంసన్, షమ్మా చర్చిలో బ్రదర్ స్టీఫెన్ చార్లెస్ భక్తులకు దైవ సందేశాన్ని ఇచ్చారు. నగరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న పాస్టర్




భక్తులకు రొట్టె, ద్రాక్షారసం అందజేస్తున్న పాస్టర్


నంద్యాలలో...


యువతుల ప్రార్థన


ఎమ్మిగనూరులో...




కర్నూలు నగరంలోని కోల్స్ చర్చిలో ప్రభు కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని పెద్దమర్రివీడు గ్రామం, నందవరం మండలంలోని జొహరాపురం గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని కందనాతి, కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం, కౌతాళం మండలంలోని పోడలకుంట, మంత్రాలయం మండలంలోని బసాపురం, ఆదోని మండలంలోని కపటి, కోసిగి మండలంలోని ఎండవల్లి, హొళగుంద మండలంలోని హొళగుంద, కౌతాళం మండలంలోని మదిరి, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని తిప్పాయపల్లె, కల్లూరు మండలంలోని బస్తిపాడు, వెల్దుర్తి మండలంలోని నర్లాపురం, కర్నూలు రూరల్‌లోని ఎదురూరు, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని తుగ్గలి మండలంలోని తుగ్గలి, ఆలూరు మండలంలోని కమ్మరికచేడు, చిప్పగిరి మండలంలోని ఖాజాపురం, ఆస్పరి మండలంలోని తురువగల్, హాలహర్వి మండలంలో గూళ్యం, జే. కొసల్లి గ్రామం మొత్తం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని పెద్దమకానం వీధికి చెందిన యువతి అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ బుధవారం రాత్రి తెలిపారు. యువతి తండ్రి నూర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అన్నారు.

మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)


నాడు: హొళగుంద-చిన్నహ్యాట రోడ్డు దుస్థితి


నేడు: హొళగుంద-చిన్నహ్యాట రోడ్డు రూ.4 లక్షలతో మరమ్మతులు

● 2025లో వీటిపై దృష్టి సారించాలి:

2024కు వీడ్కోలు పలికి.. 2025కు స్వాగతం పలుకుతున్న శుభ వేళ ఉమ్మడి జిల్లాకు చెందిన రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు అసంపూర్తిగా ఉన్న రహదారుల పనులపై ఫోకస్ పెట్టాలి. గడువులోగా పూర్తి చేయాలి. అదే క్రమంలో కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా మార్పు చేసి నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలి. కోడుమూరు-ఎమ్మిగనూరు వయా గోనెగండ్ల రోడ్డు, ఎమ్మిగనూరు-కోసిగి వయా మాలపల్లి రోడ్డు, డాణాపురం-హొళగుంద వయా హెబ్బటం రోడ్డు, ఆలూరు-హొళగుంద వయా ఎల్లార్తి రోడ్డును ఆధునికీకరించాలి. అదే క్రమంలో గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని రోడ్డును జాతీయ రహదారిగా మార్పు చేసి అభివృద్ధి చేయాలి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు-దోర్నాల వరకు జీకే రోడ్డును నల్లమల అడవిలో నాలుగు రోడ్ల రహదారిగా మార్పు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఉమ్మడి జిల్లాలో రోడ్లు భవనాలు శాఖ పర్యవేక్షణలోని రహదారులు, వివిధ పథకాలు కింద చేపట్టిన పనులు, ప్రస్తుత పురోగతి వివరాలు:

రహదారులు	కర్నూలు	నంద్యాల
బీటీ (తారు) రోడ్లు (కి.మీలు)	3,029.93	1,300.35
సీసీ రోడ్లు (కి.మీలు)	307.27	175.47
కంకర రోడ్లు (కి.మీలు)	27.28	4.88
మట్టి రోడ్లు (కి.మీలు)	25.27	32.22
మొత్తం	**3,389.75**	**1,512.92**
చేపట్టిన పనులు	227	
నిధులు (రూ.కోట్లల్లో)	1,586.69	
పూర్తైన పనులు	143	
చేసిన ఖర్చు (రూ.కోట్లల్లో)	495.74	
మరమ్మతులు పనులు(కి.మీలు)	429	
ఇచ్చిన నిధులు (రూ.కోట్లల్లో)	31.34	

ఆటో బోల్తా... బాలుడు మృతి

ఆదోని రూరల్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం గణేకల్లు గ్రామానికి చెందిన బాలుడు అరవింద్(6) రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. బుధవారం గణేకల్లు బంగారమ్మవ్వ దేవర సందర్భంగా గ్రామ శివార్లలో ఉన్న మారెమ్మ దేవాలయానికి పూజల నిమిత్తం బంధువులు ఆటోలో బయల్దేరగా.. అరవింద్ కూడ వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో అరవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు నాగవేణి, రామాంజనేయులు ప్రమాద స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

ఉయ్యాలవాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రూపనగుడి గ్రామాని కి చెందిన శేషుగాల్ల రమేష్‌పై అదే గ్రామానికి చెందిన ముసల్లిగాల్ల నాగేంద్ర, నాగార్జునలు దాడి చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. రమేష్ దంపతులు మంగళవారం రాత్రి చర్చికి వెళ్తుండగా పాత గొడవలు మనసులో పెట్టుకొని దాడి చేశారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పదింతల ప్లానింగ్

వంద రోజుల తరగతులకు శ్రీకారం

విద్యాశాఖ ఎస్ఈఆర్టీ ఆధ్వర్యంలో సిద్ధం

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాల విద్యాశాఖ ఎస్ఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణతో పాటు మరికొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఆదివారం కూడా అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 28,294 మంది ఉన్నారు. ఎయిడెడ్ పాఠశాలలో 16, ఏపీఎంఎస్ 20, బీసీ 6, ప్రభుత్వ పాఠశాలు 12, కేజీబీవీ 26, ఎంపీఎల్ 4, పీవీటీ 172, ఎస్‌డబ్ల్యూ 5, టీడబ్ల్యూ 12 జెడ్పీ పాఠశాలలు 182 ఉన్నాయి. ఇందులో బాలికలు 12,085, బాలురు 13,209 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ విద్యార్థులు ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

● ఉదయం 8 గంటల నుంచి 5 గంటల వరకు మధ్యాహ్నం 2.40 గంటల నుంచి 4 గంటల వరకు

● ఆదివారాల్లో ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

● ఇవి మార్గదర్శకాలు

● విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, అదనపు తరగతుల నిర్వహణ, నిత్యం చిన్న చిన్న పరీక్షలు పెట్టడం, అవసరమైన పాఠాల పునశ్చరణ, పబ్లిక్ పరీక్షల బ్లూప్రింట్ నమూనాలో ప్రీ ఫైనల్ నిర్వహించి భయం పోగొడతారు.

● ఉన్నతాకారుల పర్యవేక్షణకు వీలుగా ప్రతి విద్యార్థి జవాబు పత్రాలు, మార్కుల పత్రాలను భద్రపరచడం, రానున్న రోజుల్లో ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-1 గ్రాంట్ టేస్టు, ప్రి ఫైనల్ పరీక్షల సన్నద్ధత దీనిలో భాగమేనని, ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

● అదే సమయంలో మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తేదీలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.


పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పది విద్యార్థులు

● విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించి, వారికి పరీక్షలు పెట్టి వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడ్‌లుగా విభజిస్తారు. తదనుగుణంగా వారికి బోధించి మంచి ఫలితాలు సాధించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

● పాఠశాల వారీగా ప్రభుత్వం హోలిస్టిక్ కార్డులు ఇటీవల పంపిణీ చేసింది. వీటిపై ఇప్పటి వరకు అంతర్గతంగా నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ముద్రించి తల్లిదండ్రులకు అందజేయనున్నారు. వందరోజుల దీక్షలో ఎంఈవోలు పర్యవేక్షణ చేసి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ప్రోత్సహిస్తూ పర్యవేక్షణ చేస్తారు.

జిల్లాలో మంచి ఫలితాలు సాధిస్తాం



జిల్లాలో మంచి ఫలితాలు సాధించే దిశగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలవుతుంది. విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించి వారి మదింపు అంచనా వేసి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటాం. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల జిల్లా

వెండి వస్తువుల బహూకరణ

పత్తికొండ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పత్తికొండ అయ్యప్పస్వామి దేవాలయానికి పట్టణానికి చెందిన శ్రీనివాసరెడ్డి, శాంతమ్మ దంపతులు కిలో వెండి వస్తువులను బహూకరించారు. ఇంటి నుంచి మాలదారులతో కలసి ఊరేగింపుగా వెండి వస్తువులను తలపై మోస్తూ అయ్యప్ప దేవాలయానికి చేరుకుని దీపపు సెమ్మెలు, నైవేద్యం పళ్లెంలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మధుస్వామికి అందించారు. గురుస్వాములు గంగన్న, గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆదోని రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదల బియ్యాన్ని పెద్దల సహకారంతో కొందరు చోటామోటా కూటమి నాయకులు సిండికేట్‌గా మారి సరిహద్దులు దాటిస్తున్నారు. ఇందులోభాగంగానే సిండికేట్‌దారులు రేషన్ బియ్యాన్ని అక్రమ గోడౌన్‌లో నిల్వ ఉంచారన్న సమాచారం రావడంతో తాలుక పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఆస్పరి రహదారిలోని మారెమ్మదేవాలయం వెనుకల ఉన్న రేకుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 14 ప్యాకెట్ల బియ్యంతోపాటు రాజశేఖర్ అనే వ్యక్తిని అదుపులో తీసుకున్నామని, రెవెన్యూ అధికారులకు అప్పజెబుతామని ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు.

వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారని, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేసే నైతిక హక్కు వారికి లేదని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2014లో 22.05 మిలియన్ విద్యుత్ యూనిట్ల లోటుతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. 2014-19 వరకు రకరకాల విద్యుత్ ఒప్పందాల ద్వారా చంద్రబాబు కష్టపడి రాష్ట్రాన్ని విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంచారన్నారు. ఆ తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాలను ఆకారణంగా రద్దు చేసి ఏపీని అంధకారంలో తోసేశారని ఆరోపించారు. కక్ష రాజకీయాలతో ఏపీని చీకటిమయం చేయడమే కాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొనగోళ్లలో అందుకు సంబంధించిన మెటీరియల్ కొనుగోళ్లలో అవినీతి మయం చేశారని ఆరోపించారు. మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని లోటు విద్యుత్ రాష్ట్రంగా తయారు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ తయారీ నిలిచిపోయి బయటి నుంచివిద్యుత్ కొనుగోలు చే సే పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో ప్రజలపై విపరీతమైనభారం పడుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పది దఫాలుగా విద్యుత్ చార్జీలను పెంచారని గుర్తు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రజలపై మోపిన భారాన్ని ఎలా తగ్గించాలని ఆలోచనలతో శ్వేత పత్రం కూడ విడుదల చేశారని, దీనిపై మంత్రులు చర్చించారని చెప్పారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయం చేయాలనుకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

నేడు అందుబాటులో ఉండను

ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతకారణాలతో వేరే ప్రాంతంలో ఉండడంతో గురువారం పుట్టినరోజున తాను పత్తికొండలో అందుబాటులో ఉండనని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కార్యకర్తలకు, నాయకులకు తెలియచేశారు. బుధవారం అయన ఫోన్‌లో మాట్లాడుతూ తన పుట్టిన రోజు వేడుకలను నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాలను తమతమ గ్రామాలలో జరుపుకోవాలని సూచించారు. కాగా నూతన సంవత్సర వేడుకలను అందరితో జరుపుకునేందుకు జనవరి 1న పత్తికొండలో ఉంటానన్నారు. అయితే తనను కలిసేందుకు వచ్చే ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అధికారులు పూలదండలు, శాలువాలను తీసుకురావద్దని సూచించారు.









ఘనంగా క్రిస్మస్

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ● యేసు సందేశాన్ని వినిపించిన పాస్టర్లు



ఆలూరు: ఎంకొట్టాల సీఎస్ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

క్రిస్మస్ పండుగను క్రైస్తవులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. ఫాదర్లు యేసు సందేశాన్ని వినిపించారు. ప్రముఖులు ప్రార్థన మందిరాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసుకొని సంబరాలు చేసుకున్నారు. క్రైస్తవులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శిలువ ఊరేగింపు నిర్వహించారు. మత పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యేసు సూచించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. సర్వమానవాళికి ప్రేమసందేశం అందించిన సంతోషకరమైన శుభదినమే క్రిస్మస్ అని చెప్పారు.



ఆదోని రూరల్: కపటి గ్రామంలో..



ఆదోని అగ్రికల్చర్: ఆదోని ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న పాస్టర్



మద్దికెరలో..



వెల్దుర్తి: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



దేవనకొండ మండలంలో..



ఆదోని అగ్రికల్చర్: ఆదోని విక్టోరియా పేట సీఎస్ఐ చర్చిలో క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న కోయర్ టీం సభ్యులు



తుగ్గలిలో..




ఆదోనిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

రైలు నుంచి జారిపడ్డ యువతి

బత్తలపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె హరిత ట్రైన్‌లో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడింది. హరిత కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం తమ్ముడితో కలిసి కలికిరి నుంచి గుంతకల్లుకు ట్రైన్‌లో బయలుదేరింది. మండలంలోని డి చెర్లోపల్లి సమీపంలో ఆ రైలు వెళ్తుండగా.. వాష్ రూంకు వెళ్లిన ఆ యువతి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడింది. హరిత ఎంతసేపటికీ రాకపోవడంతో ఆమె తమ్ముడు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు హరిత సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమె లొకేషన్ గుర్తించి ట్రాక్‌మన్ మస్తాన్‌ను అప్రమత్తం చేశారు. అతను ఆ యువతి పడి ఉన్న ప్రదేశానికి వెళ్లి.. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే పోలీసులు ఆమెను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

'న్యాయం చేయాలి'

తుగ్గలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శనగ పంటను నూర్పిడి చేస్తున్న మిషన్‌పై ఎక్కిన గొర్రెల కాపరి రామాంజనేయులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారని, న్యాయం చేయాలని బంధువులు, స్థానిక నాయకులు బుధవారం జొన్నగిరి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని, కేసు నమోదు చేయాలని జొన్నగిరి పోలీసులను కోరగా.. వారు నిరాకరించడంతో ప్రధాన రహదారిపై బంధువులు, స్థానిక నాయకులు రాస్తారోకో చేశారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ అక్కడకు చేరుకుని నిరసనను విరమించారు. మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ వల్లె వెంకటేశ్ ఉన్నారు.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దుర్తి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం ఎస్సీ కాలనీలో సుధాకర్ ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందారు. స్నేహితుని కుటుంబాన్ని ఆదుకునేందుకు 1989-90 బ్యాచ్ (జిల్లా పరిషత్ హైస్కూల్) కు చెందిన మిత్రులు కొందరు ముందుకు వచ్చి మృతుని కుటుంబానికి బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలపై నిషేధం

ఆదోని టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్లాస్టిక్ కవర్ల విక్రేతలకు మునిసిపల్ కమిషనర్ కృష్ణ సూచనలు జారీ చేశారు. తక్కువ మైక్రాన్ కలిగి ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. వాటి అమ్మకాలను కొనసాగిస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

జవాన్‌కు సన్మానం

మద్దికెర, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణానికి చెందిన జవాన్ బి.రామాంజనేయులును జనసేన పార్టీ నిర్వహణ కమిటీ సభ్యులు వైక్రాంతి కుమార్ బుధవారం ఆయన స్వగృహంలో సన్మానించారు. భారత సరిహద్దులో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా, రాష్ట్రపతి శౌర్య పురస్కారాన్ని అవార్డు అందుకోవడం అభినందనీయమని వారు అన్నారు. జనసేన నాయకులు జయరాం, అహ్మద్, రహీం, శేఖర్ ఉన్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన ఇద్దరి పై కేసు

ఆదోని, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని మహాత్మ గాంధీ నగర్‌లో 60 సెంట్ల స్థలం మున్సిపల్ ఓపెన్ సైట్ స్థలంలో 2016లో టీడీపీ ప్రభుత్వం హయాంలో సీసీ రోడ్డును నిర్మించారు. అక్రమంగా ప్రభుత్వం స్థలంలోకి ప్రవేశించి అనుమతి లేకుండా ఆ రహదారిలో రాత్రికి రాత్రే గోపాల్ రెడ్డితో పాటు జనార్ధన్ అనే వ్యక్తులు ధ్వంసం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సూర్య మెహన్‌రావు తెలిపారు. కాలనీవాసులు ఆర్టీసీ కాలనీ వైపు రాకుండా అక్రమంగా కట్టిన గోడలను ఎమ్మెల్యే పార్థసారథి పరిశీలించి వాటిని తొలగించాలని ఆదేశించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


చింతకుంట సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ఎమ్మిగనూరులోని సెయింట్ ఆడ్రూస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో క్రిస్మస్ శుభకాంక్షలు తెలుపుతున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో వెలసిన చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధానంగా కలుగొట్ల రోడ్డులోని ఎంబీ చర్చి, ఆర్‌సీఎం, క్రిస్టియన్ అసెంబ్లీ, బేతేలు ప్రార్థనా మందిరం, సెయింట్ ఆడ్రూస్ సీఎస్ఐ టౌన్ చర్చి, సీఆర్‌సీ చర్చిలతోపాటు ఆయా ప్రాంతాల్లో వెలసిన చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎంబీ చర్చిలో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బీవీని సంఘపెద్దలు, సంఘకాపరి జయన్న ఆశీర్వదించి సన్మానించారు. అలాగే వైసీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, బుట్టా నీలకంఠ, వీరశైలింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్ ఎంటీ, సీఎస్ఐ చర్చిల్లో ప్రార్థనల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వీరిని ఆయా చర్చిల సంఘం పెద్దలు సన్మానించారు. అలాగే కాలనీలోని ఆయా ప్రాంతాల్లో యువకులు ఏర్పాటుచేసిన పశువుల పాకలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● **మంత్రాలయం:** మంత్రాలయం, మాధవరం, తుంగభద్ర, మాలపల్లి, వగరూరు, తిమ్మాపురం, రచ్చుమర్రి, సూగూరు, చిలకలడోన బసాపురం తదితర గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సీఎస్ఐ డివిజనల్ చైర్మన్ రెవ.వేదనాయకం, రెవ. జాన్‌వెస్లీ, ఎస్‌డీ రాజన్న, యేసురాజు ఆధ్వర్యంలో చర్చిలో ప్రార్థనలు చేశారు.

● **గోనెగండ్ల/ కోసిగి:** గోనెగండ్లతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గోనెగండ్ల చర్చిల్లో పాస్టర్ దివ్యరాజు ఏసు జన్మగొప్ప తనాన్ని వివరించారు. ప్రపంచ శాంతి కోసం దైవదూత ఏసుక్రీస్తు జన్మించాడని తెలిపారు. అన్ని గ్రామాల్లో రెండు రోజుల ముందుగా చర్చిలను సందర్భంగా రంగురంగులతో అలంకరించారు. కోసిగి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని సీఎస్ఐ, ఆర్సీఎం, యేసుకృప, ప్రార్థన మందిరాల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఆయా చర్చిల్లో ఫాస్టర్లు రాజారత్నం, దేవరాజు, ప్రేమ్ కుమార్, ఫాదర్ టోనీ, దేవపుత్ర, ప్రేమ్ కుమార్, చిదానంద, శ్రీనివాసులు క్రైస్తవ సందేశాన్ని వినిపించారు.

● **పెద్దకడుబూరు:** పెద్దకడుబూరుతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లోని చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయాన్నే ప్రార్థనా మందిరాలకు వెళ్లి యేసుప్రభును స్మరించుకొని ప్రార్థనలు చేశారు. పెద్దకడుబూరులోని చర్చిలో టీడీపీ జిల్లా ఇన్‌చార్జి తిక్కారెడ్డి పాల్గొని ప్రార్థనలు చేశారు. టీడీపీ రాష్ట్ర రైతు సంఘం నాయకులు నరవరమాకాంతరెడ్డి, మీసేవా ఆంజనేయులు పాల్గొన్నారు.

● **ఎమ్మిగనూరు రూరల్:** ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు, సిరాలదొడ్డి, కందనాతి, కడివెళ్ల, కడిమెట్ల, కె.తిమ్మాపురం, ఏనుగుబాల తదితర గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో టీడీపీ నాయకులు దేవదాసు ఇంటికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వెళ్లారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మల్లికార్జున, కేటీ వెంకటేశ్వర్లు, జగదీష్, సోమేశ్వరరెడ్డి, శంకర్‌గౌడు, రాళ్లదొడ్డి మురళీకృష్ణారెడ్డి, అయ్యన్న పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ఆశీర్వదిస్తున్న పాస్టర్


పెద్దకడుబూరు చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న తిక్కారెడ్డి


మాధవరంలో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. బుధవారం క్రిస్మస్ సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మంగళవారం సాయంత్రం నుంచి వేలాది మంది భక్తులు రావడంతో శ్రీమఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. భక్తుల రద్దీని ఆసరగా చేసుకొన్న లాడ్జీల యజమానులు గంటగంటకు రేట్లు పెంచుతూ భక్తుల నుంచి వేలల్లో వసూలు చేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం ధనుర్మాసం దశమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరత్నాల రథంపై ఉత్సవమూర్తిని ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించి హారతులిచ్చారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన రామగోపాల్ అనే భక్తుడు రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషిలు తెలిపారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం కుటుంబ సమేతంగా మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. డీఎస్పీ వెంట సీఐ రామాంజులు ఉన్నారు.


మఠం ప్రాంగణంలో కిక్కిర్సిన భక్తులు

ఘనంగా మారెమ్మ దేవర

కోసిగి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుద్ది, కోల్‌మాన్‌పేట, సాతనూరు, అగసనూరు, వందగల్లు, జుమాలదిన్నె, చింతకుంట, గౌడుగల్లు గ్రామాల్లో బుధవారం ఘనంగా మారెమ్మ అమ్మవారి దేవర వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి గ్రామాల్లో అమ్మవార్లకు భక్తులు, మహిళలు పూర్ణకుంభాలు, నైవేద్యాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలకు టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ముత్తురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మారెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీడీపీ నాయకులకు పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని చిన్న తాయన్న, చింతలగేని నర్సారెడ్డి, జ్ఞానేష్, మదిరి వీరారెడ్డి, సాతనూరు వెంకటేశ్, నాగేంద్ర, రామిరెడ్డి, మాదేవ, లక్ష్మన్న భక్తులు పాల్గొన్నారు.


మారెమ్మ ఆలయం ముందు బారులుదీరిన భక్తులు

మాచాపురంలో ఎద్దుల గిరకలాగు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కాశీంవలి

నందవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని గ్రామస్థులు మండల స్థాయి ఎద్దుల గిరక లాగుడు పోటీలు నిర్వహించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ సర్పంచ్ కాశీంవలి బుధవారం పాఠశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ముగతి గ్రామానికి చెందిన ఎద్దులు గిరకలాగుడు పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్నాయి. హాలహర్వికి చెందిన ఎద్దులు రెండో బహుమతి, మూడో బహుమతి దక్కించుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎంపీటీసీ కాలేబు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ పీరసాబ్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు


వాజ్‌పేయ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు బుధవారం సోమప్ప సర్కిల్‌లో బీజేపీ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వైసీపీ కరపత్రాలు విడుదల

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం కరెంట్ చార్జీలపై పోరుబాటకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీర శైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు వై రుద్రగౌడు, బీఆర్ బసిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎలక్షన్స్ ముందు కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పిందని అన్నారు. కరెంట్ చార్జీల పెంపుపై ఈ నెల 27న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుడుతున్నామని వివరించారు. బుట్టా నీలకంఠ, ఎంపీపీ కేశన్న పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎమ్మిగనూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యల్లంబీడు ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన 46 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యల్లంబీడు ప్రాంతంలో బొరుగుల బటి దగ్గర అక్రమంగా నిల్వ ఉంచిన 46 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిల్వ ఉంచిన ఆదోని పట్టణానికి చెందిన ఎరుకల ఆకాష్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసు కున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు సీఎస్‌డీటీ మహేష్, ఆర్ఐ లక్ష్మన్న ఆధ్వర్యంలో అప్పగించామన్నారు.

బొలేరోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కొటేకల్లు క్రాస్ రోడ్డు సమీపంలో బొలేరోను ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ సీఐ బీవీ మధుసుదన్‌రావు వివరాల మేరకు.. మల్కాపురం గ్రామానికి చెందిన దానియేలు, రవికుమార్‌లు ఆదోని మండలం తంబగల్‌కు పని నిమిత్తం వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా కొటేకల్ క్రాస్ రోడ్డు దగ్గర ముందుగా వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రవికుమార్, దానియేల్ గాయాలయ్యాయి. రూరల్ సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.